# మనం మెదక్ సంగారెడ్డి సిద్దిపేట



శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025 పేజీలు: 7


## లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

2



# భూభారతితో.. భూ సమస్యలకు చెక్

**ధరణితోనే భూముల పంచాయతీ**

**భవిష్యత్తులో భూపంచాయతీలుండొద్దు**

**జూన్ 2 నుంచి క్షేత్రస్థాయిలో అమలు**

**ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఫిర్యాదు చేయాలి**

**రాష్ట్ర రవాణా, బీ.సీ. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, ఏప్రిల్ 24,(మనం న్యూస్): భూభారతి పోర్టల్ తో భూసమస్యలకు చెక్ పడుతుందని రాష్ట్ర రవాణా, బీ.సీ. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మండలంలోని పోతారం (ఎస్) గ్రామంలోని శుభం గార్డెన్స్ లో నూతన ఆర్.వో.ఆర్.చట్టం, భూభారతి పోర్టల్ పై రైతులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి భూమి పంచాయతీలుండొద్దు అనే భూభారతిని తీసుకువచ్చామన్నారు. భూముల విలువలు పెరగటంతోనే భూసమస్యలు వచ్చాయన్నారు. ధరణీ వచ్చిన తర్వాత భూపంచాయతీలు ఎక్కువయ్యాయి అన్నారు. భూసమస్యల పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకునేవారన్నారు. భూభారతితో ప్రతి భూమి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రభుత్వ భూములు ఎవరూ కబ్జా చేసినా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ భూమిని ఎవరూ కబ్జా చేసినా వారి వద్ద నుంచి భూమిని తీసుకుని అభివృద్ధి కోసం ఉపయోగిస్తామని స్పష్టం చేసారు. ఎక్కడైనా పేదలకు భూములు దానం చేసి ఉండి దానం చేసిన వారు మళ్లీ

-మిగతా 2లో



# సహించేది లేదు

**-ధర్మ రక్షణకు హింస అనే ఆయుధం తప్పదు**

**-మతం అడిగి మరీ దాడులా?**

**-రాహుల్ విదేశీ పర్యటనలో ఉన్న ప్రతిసారీ దాడులు**

**- సూడో సెక్యులర్లు మౌనం వీడాలి**

**- మదర్సాలలో ఏం జరుగుతోంది?**

**- ఎం.ఐ.ఎం. నేతల చేతుల్లో వక్ఫ్ భూములు**

**- మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

సిద్దిపేట, ఏప్రిల్ 24, మనం న్యూస్ ప్రతినిధి: హిందూ ధర్మం పరమత సహనాన్ని ముమ్మాటికీ పాటించమని చెబుతుంది. అదే సమయంలో ధర్మాన్ని కాపాడుకునేందుకు హింసా అనే ఆయుధాన్ని కూడా వాడమని చెప్పింది. ఇక మీదట దాడులను ఉపేక్షించం.. సహించబోం. ముమ్మాటికీ ప్రతీకారం తప్పదని మెదక్ పార్లమెంట్ సభ్యులు ఎం. రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఒక వైపు పహల్గాంలో మతం పేరుతో జరిగిన టెర్రరిస్టుల ఘాతకాలు ఉమ్మడి జిల్లాలోనూ హిందూ దేవాలయాలపై ఒక వర్గం వ్యూహాత్మకంగా చేస్తున్న దాడులను తిప్పికొట్టే సమయం ఆసన్నమైందని అన్నారు. మతం అడిగి మరీ దాడులకు పాల్పడుతున్నారంటే వారి వైఖరి స్పష్టమని, ఇలాంటి వారికి ముమ్మాటికీ బదలా ఇచ్చి తీరుతామన్నారు. హిందూయేతర వ్యక్తులపై చిన్నచిన్న సంఘటనలు జరిగితే గొంతులు చించుకొని అరిచే సూడో సెక్యులర్లు అయిన స్టాలిన్, ఉదయనిధి, ప్రకాష్ రాజులు ఇప్పుడు నోరెందుకు మూసుకున్నారో స్పష్టం చేయాలన్నారు. పదేండ్ల పాటు మోదీ నేతృత్వంలో దేశం అత్యంత భద్రంగా ఉందని, అందాల కాశ్మీరాన్ని, శాంతికి విఘాతం కలిగించాలని మతం అడిగి మరీ దాడులకు ఎగబడ్డ ఏ ఒక్కరినీ వదిలిపెట్టే పరిస్థితి లేదన్నారు. అంబేద్కర్ ను వ్యతిరేకించింది ముమ్మాటికీ కాంగ్రెస్ కమ్యూనిస్టులేనని, చివరికి అంబేద్కర్ ఎన్నికల్లో నిలబడితే ఇరువురూ కుమ్మక్కై ఓడించిన పరిస్థితి అందరికీ తెలుసన్నారు. మన దేశం నుండి వచ్చిన మతాలెప్పటికీ దేశాన్ని కాపాడలేవని నాడు అంబేద్కర్

-మిగతా 2లో

## భూ భారతితో నిర్ణీత గడువులోపు

# భూ సమస్యలు పరిష్కారం

**రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.**

**వ్యక్తికి ఆధార్ భూమికి భూదార్**

**జియో కోఆర్డినేషన్ తో భూ పటం, సరైన సరిహద్దులు**

**ఉచిత న్యాయ సేవలు : కలెక్టర్ క్రాంతి వల్లూరు**




సంగారెడ్డి ఏప్రిల్ 24 మనం న్యూస్ ప్రతినిధి...నిర్ణీత గడువు లోపు భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం దోహదపడుతుందని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. భూమి హక్కుల రికార్డులలో ఏవైనా లోటుపాట్లు, తప్పులు ఉంటే వాటిని సవరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ నూతన ఆర్.ఓ.ఆర్ -2025 చట్టం వెసులుబాటు కల్పిస్తుందని అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం లోని నాగలిగిద్ద, మనూర్, సిర్గాపూర్ , మండల కేంద్రాలలో భూభారతి చట్టంపై గురువారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, నారాయణఖేడ్ శాసన సభ్యులు సంజీవరెడ్డి , ఈ కొత్త చట్టం వల్ల రైతులకు, ప్రజలకు చేకూరే ప్రయోజనాలు, చట్టంలో పొందుపర్చిన కీలక అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ధరణి రికార్డులను భూభారతిలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరికైనా భూముల రికార్డుల విషయంలో తప్పులు ఉంటే, ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాలకు వచ్చి అర్జీలు

-మిగతా 2లో



# లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

**-మే 21 లోగా జాబితాను సిద్ధం చేయండి**

**-జిల్లా కలెక్టర్ మను చౌదరి**

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 24, మనం న్యూస్: రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను, బ్యాంకులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లతో రాజీవ్ యువ వికాస లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకం కింద దాదాపు 60 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, జిల్లాకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్దిదారుల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని సూచించారు. శుక్రవారం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి దరఖాస్తుల స్క్రూటినీ చేయాలన్నారు. ఎస్. బి.ఐ., టి.జి.బి., యూనియన్ బ్యాంకులలో ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. బ్యాంకర్ల వారీగా సిద్ధం చేసిన జాబితాను మే 21వ తేదీ లోగా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ల్.డి.ఎం. హరిబాబు, డి.ఆర్. డి.ఓ. జయదేవ్ ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో.. భూ సమస్యలకు చెక్

మొదటి పేజీ తరువాయి

గుంజుకున్న అన్నిటికి రికార్డులుంటాయిన్నారు. మీకు ఏ సమస్య ఉన్న రెవెన్యూ అధికారుల వద్ద అప్లికేషన్ పెట్టుకుంటే మూడు నెలల్లో మీ సమస్యను పరిష్కారిస్తారని చెప్పారు. జూన్ 2 నుంచి భూభారతి చట్టం క్షేత్రస్థాయిలో అమలు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున్, ఆర్టీఏ మెంబర్ సూర్యవర్మ, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయిని నిర్మల, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు. ఆయా శాఖల అధికారులు, తదితరులున్నారు.



**కోర్టుకు వెళ్లాల్సిన పని లేదు..**

**- జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి**

భూసమస్యల పరిష్కారానికి కోర్టుకు వెళ్లకుండా ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఆర్.వో.ఆర్. చట్టం. భూభారతి పోర్టల్ తోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. భూభారతి చట్టం పై రైతులందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. భూభారతి చట్టంలో రికార్డుల్లో సవరణ చేయడానికి ఆప్షన్ ఉంది అన్నారు. ప్రజావాణి, ధరణిలో తప్పు పడిన పేర్లు తొలగించే ప్రయత్నం చేసిన కాలేదని.. ఇప్పుడు తప్పుగా వచ్చిన రికార్డులు ఉన్న పేరు ఇద్దరిని పిలిచి నెల రోజుల్లో సమస్యను పరిష్కారం చేయవచ్చు అన్నారు. మ్యూటేషన్, రిజిస్ట్రేషన్, ఫోర్జరీ, కబ్జా భూములను కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు. సర్వే హద్దుల పై భూధార్ కార్డు వస్తుందన్నారు. తహసీల్దార్ పాస్ చేసిన ఆర్డర్ ఆర్డీవో, కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చు అన్నారు. రైతులకు ఉచిత న్యాయసేవలు అందించనున్నారని తెలిపారు. మీ డాక్యుమెంట్స్ తీసుకువస్తే సమస్య అక్కడే పరిష్కారం అవుతుందన్నారు. గత సంవత్సరాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయడానికి ప్రభుత్వం ఈ చట్టం తెచ్చిందన్నారు.

# సహించేది లేదు

మొదటి పేజీ తరువాయి

చెప్పిన మాటలు ఒక్కసారి గుర్తుచుకోవాలన్నారు. భారత రాజ్యాంగ పుస్తకంలోనూ రాముడు, కృష్ణుడు, భగవద్గీత బొమ్మలున్నాయని, దీన్ని బట్టి హిందుత్వం మతం కాదు, ధర్మం అని గమనించాలన్నారు. కానీ కొంతమంది ఏమీ తెలియని కాంగ్రెస్ మూర్ఖులు రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తామే రక్షకుల మంటూ ఫోజులు కొడుతున్నారన్నారు. రాహుల్ విదేశీ పర్యటనలో ఉన్న ప్రతిసారి టెర్రరిస్టుల ఘాతకాలు జరుగుతున్నాయంటే వీరి వెనుక కాంగ్రెస్ ఉందన్నది సుస్పష్టమన్నారు. మదర్సాల పేరుతో హిందూ మతాన్ని విచ్చిన్నం చేసేందుకు జరుగుతున్న కుట్రలపై సమగ్ర విచారణ జరగా ల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోనూ గుమ్మడిదల, జిన్నారంలలో దేవాలయాల ధ్వంసానికి పాల్పడింది మదర్సాలలో ఉన్నవారేన ని, వీరంతా ఎక్కడి వారు, వారి గుర్తింపు ఏంటో ఒక్కసారి పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే మదర్సాలపై నివేదిక తెప్పించుకోవాలని, ఎవరెవరు ఉంటున్నా రు, ఎక్కడి వారుంటున్నారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ముస్లింలను ముమ్మాటికీ మోసం చేస్తున్న పార్టీ ఎం.ఐ.ఎం. అని, హైదరాబాద్ అంతా అభివృద్ధిలో పరుగులు పెడుతుంటే పాతబస్తీ మాత్రం ఇంకా మురికి కూపంలో ఉండడానికి కారణం ఎవరో, మెట్రో రాకుండా అడ్డుకుంటుంది ఎవరో ప్రజలందరికీ తెలిసే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. వక్ఫ్ పేరుతో భూములన్నింటినీ అక్బర్ కుటుంబం చేతుల్లో పెట్టుకొని ముస్లింలను అభివృద్ధికి దూరం గా ఉంచుతున్నారన్నారు. ఇక మీద హిందూ సమాజం దాడులను ఉపేక్షించే పరిస్థితి లేదని, చర్యకు ముమ్మాటికీ ప్రతిచర్య ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, నాయకులు నలగామ శ్రీనివాస్, కొత్తపల్లి వేణుగోపాల్, బానంగారి వెంకన్న, తొడుపునూరి వెంకటేశం, గుండ్ల జనార్ధన్, చింత సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో నిర్ణీత గడువులోపు భూ సమస్యలు పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

స్వీకరిస్తారని అన్నారు. ఈ అర్జీలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా తప్పులను సవరిస్తారని, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. మొదటి అంచెలో ఆర్డీఓ అప్పీలును పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారని, అయినా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని, ల్యాండ్ ట్రిబ్యునల్ ను కూడా అప్పీలు చేసుకునేందుకు భూభారతి చట్టం అవకాశం కల్పిస్తుందని వివరించారు. అప్పీలు చేసుకున్న సన్న చిన్నకారు, పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని అన్నారు. రైతులు భూ సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, నిర్దిష్ట కాల వ్యవధిలో వాటిని పరిష్కరించి, రైతుల భూములపై వారికి హక్కులు ఏర్పరుస్తూ, వారికి పూర్తి భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టా పాస్ బుక్కులలో సమగ్ర వివరాలతో, హద్దులను పేర్కొంటూ భూమి పటం (మ్యాప్) పొందుపరుస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు సర్వే మ్యాప్ రూపొందించి పట్టా పాస్ బుక్కుకు జత పరుస్తారని అన్నారు. ఆధార్ తరహాలోనే భూముల వివరాలతో కూడిన భూధార్ నెంబర్ కేటాయిస్తారని తెలిపారు. ఈ చట్టంలో ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు





కూడా హక్కుల రికార్డు ఉంటుందన్నారు. ఎవరైనా మోసపూరితంగా హక్కుల రికార్డులు తారుమారు చేసి ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే అలాంటి పట్టాలను రద్దు చేసే అధికారం భూభారతి ద్వారా అధికారులకు కల్పించారని వివరించారు. ధరణిలో కొన్ని భూ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉండేది కాదని, అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం తహసీల్దార్, ఆర్డీఓ లకు దరఖాస్తులు చేసుకుని సమస్యలు పరిష్కరించుకునేలా భూభారతి వెసులుబాటు కల్పిస్తుందని అన్నారు.. సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను కోర్టు స్టే విధించడం వల్ల ధరణిలో పరిష్కరించేందుకు అవకాశం లేకపోయిందని, ప్రస్తుతం కొత్త ఆర్ ఓ ఆర్ చట్టంలో పెండింగ్ దరఖాస్తులను ఆర్డీఓలు పరిశీలించి క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. అర్హులైన రైతులు ఈ చట్టంపై అవగాహనను పెంపొందించుకుని, భూ సమస్యలు ఉంటే గ్రామ సభలలో అధికారులకు అర్జీలు అందించి పరిష్కరించుకోవాలని, ధరణి పోర్టల్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టంతో అసైన్మెంట్ కమిటీలు పునరుద్ధరణ చేశారని,గత ప్రభుత్వం భూ చట్టాల్లో ఎన్నో అక్రమాలు చేసిందని,భూ భారతి చట్టం కోసం దేశం లో ఎన్నో భూ చట్టాలు అధ్యయనం చేసి ఈ చట్టాన్ని రూపొందించారని,నారాయణఖేడ్ నియోజక వర్గంలో 32 కోట్ల రూపాయలు రుణ మాఫీ జరిగిందని,ఈ ప్రాంతానికి త్రాగునీటి అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ అని , సబ్సిడీపై చాలా వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసిందన్నారు.

నారాయణఖేడ్ ప్రాంతానికి వైద్య,విద్య వ్యవస్థ చాలా బలోపేతం అయిందన్నారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ మాధురి,జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీవో అశోక చక్రవర్తి, తహసీల్దార్ విష్ణు సాగర్, రెవెన్యూ అధికారులు, రైతులు, రైతు సంఘాలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివే వారు ఎక్కడైనా రాణిస్తారు

**టీజీ ఐడిసి మాజీ ఛైర్మన్ మొహమ్మద్ తన్వీర్ రాష్ట్రంలో రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థినికి సన్మానం**



జహీరాబాద్ ఏప్రిల్ 24 మనం న్యూస్: కష్టపడి చదివే విద్యార్థులు ఎక్కడ చదివినా వారు తమ ప్రతిభను కనబరుస్తారని టీజీ ఐడిసి మాజీ ఛైర్మన్ మొహమ్మద్ తన్వీర్ పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఆర్ ఎల్ ఆర్ జూనియర్ కళాశాలలో బైపిసి గ్రూప్ నందు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బిజీ సరయు 440 మార్కులకు గాను 336 సాధించి రాష్ట్రంలో రెండవ ర్యాంకు సాధించడం పట్ల ఆయన తన సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆ బాలికను అభినందించారు. ఈనాడు ప్రభుత్వం విద్యా విధానంలో తీసుకువచ్చిన మార్పుల కారణంగా మారుమూల గ్రామీణ స్థాయిలో ఉన్నటువంటి కళాశాలల్లో కూడా విద్యను అభ్యసిస్తున్నటువంటి విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నారంటే ఇది విద్యార్థుల ప్రతిభను బట్టి గుర్తించడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించినటువంటి బీజీ సరయు రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించడం పట్ల వారి తల్లిదండ్రులకు అభినందించి, విద్యార్థినికి పూలమాలలతో సత్కరించి, శాలువాలతో సన్మానించారు. ఇంకా ఉన్నతమైన ర్యాంకులు సాధించి జహీరాబాద్ నియోజకవర్గానికి తమ కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆశీర్వదించి, ఆకాంక్షించారు. ఏ రంగంలో చూసిన గ్రామీణ స్థాయి విద్యార్థులే రాణిస్తున్నారని గుర్తు చేశారు. గ్రామీణ స్థాయిలో ఉన్నటువంటి విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో ఏ కార్యక్రమం చేయాలనుకున్నా దాన్ని విజయవంతంగా చేయగలుగుతారని ఆయన అభిప్రాయపడ్డారు. జహీరాబాద్ ప్రాంతంలో ఉన్నటువంటి కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో పాటు ఉత్తమమైన విద్యాబోధన చేయడంతోనే రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించగలుగుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మంకాల్ సుభాష్ గుప్తా, సీనియర్ నాయకులు రంజోల్ వైద్య నాథ్, శ్రీకాంత్ రెడ్డి, మొహమ్మద్ ఖుతుబొద్దీన్, మొహమ్మద్ జహాంగీర్ ఖురేషి, రంగా అరుణ్ కుమార్, మొహమ్మద్ తాజోద్దీన్, బిజీ సందీప్, బాల్ రెడ్డి, మొహమ్మద్ నిజాం, తదితరులు పాల్గొన్నారు.



## సమాజ సేవతోనే సంతృప్తి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 24, మనం న్యూస్: సమాజ సేవలో ఆత్మ తృప్తి ఉంటుందని జోన్ ఛైర్మన్ చకిలం రవి అన్నారు. గురువారం మురం శెట్టి ముత్యం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శివకుమార్ మంజుల ఆర్థిక సహాయంతో సిద్దిపేట అర్బన్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పడిగె భాగ్య సత్తయ్య దంపతుల కూతురు అక్షిత వివాహానికి పుస్తెమట్టెలు 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మురంశెట్టి కుమార్, ఎర్రం శివశంకర్, గ్రీటింగ్స్ ఛైర్మన్ మర్యాల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన


సిద్దిపేట, ఏప్రిల్ 24, మనం న్యూస్ అర్బన్: జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సిద్దిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులందరూ విధులను బహిష్కరించి కోర్టు గేటు ముందు నిరసన తెలిపి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాటికొండ రమేష్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు హరిశ్చంద్ర, రామేశ్వర్ రావు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.






## వేసవి శిక్షణా కార్యక్రమం ప్రారంభం

మిరుదొడ్డి, ఏప్రిల్ 24, మనం న్యూస్: సిద్దిపేట జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశానుసారం కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వేసవి శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ మాట్లాడుతూ ఈ నెల 24 నుండి పదిరోజుల పాటు విద్యార్థులకు డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, క్రాఫ్ట్, యోగ, చేతి వ్రాత నైపుణ్యము వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, తల్లితండ్రులు విద్యార్థులను పాఠశాలకు పంపించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, శివకుమార్, విద్యాప్రకాష్, రామచంద్రం, వినోద, రాజేశ్వరి, కృష్ణమూర్తి,శివకుమార్, విద్యాప్రకాష్,రామచంద్రం, వినోద,అంగన్వాడీ ఉపాధ్యాయులు సునంద,స్వరూప తదితరులు పాల్గొన్నారు.



## మతిస్థిమితం లేని మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య

కొండపాక, ఏప్రిల్ 24, మనం న్యూస్: మతిస్థిమితం లేని మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాక మండలం సిరసనగండ్లలో గురువారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు అందించిన వివరాల ప్రకారం సిరిసినగండ్ల గ్రామానికి చెందిన చెంది లక్ష్మి (56) అనే మహిళ కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకుండా అనారోగ్యంతో బాధపడుతుంది. కొద్ది రోజులకు చనిపోతానని బెదిరించేది. గురువారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రానందున కుటుంబ సభ్యులు వెతుకుతుండగా వారి వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని కనబడింది. వెంటనే ఆమెను కిందికి దింపి సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా గమనించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కొడుకుకు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విద్యాసాగర్ తెలిపారు.




## జోగిపేటలో ధార్మిక సేవ సమితి ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

జోగిపేట: ఏప్రిల్ 24 :(మనం న్యూస్) : సంగారెడ్డి జిల్లా ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో నీ జోగిపేటలో గురువారం పహల్గాం లో హిందువులపై దాడికి నిరసనగా యువజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో క్లాక్ టవర్ నుండి మెయిన్ రహదారుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ పహాల్గంలో హిందువులపై ఉగ్రవాదుల దాడి నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమంలో ఇందుకు బాధ్యులైన ఉగ్రవాదులను అంతమొందించాలని నిరసనలో తెలిపారు. పహల్గాం లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా పలు గ్రామాలలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు.

## పహల్గాం ఉగ్ర దాడి హేయనీయం


**– మార్నింగ్ వాకర్స్ ఆధ్వర్యంలో నిరసన**




సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24, మనం న్యూస్: జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్ పై చర్యలకు ఉపక్రమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సంతోష్ కుమార్, శివకుమార్, బీజేపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్ ఎలక్ట్రానిక్స్‌కు ముగ్గురు గీతం విద్యార్థుల ఎంపిక

**ఫిక్స్ డ్ టర్మ్ ఇంజనీర్స్ (ఈ-ఐఐ గ్రేడ్) పదవులకు ఎంపిక**



Bhattu Saisrija | Gayatri Rachana Tripurana | Kakkireni Manikanta

పటాన్చెరు ఏప్రిల్ 24మనం న్యూస్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు విద్యార్థులు మరో ఘనత సాధించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈసీఈ విభాగం చివరి ఏడాది విద్యార్థులు ముగ్గురు ప్రాంగణ నియామకాలలో రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు ఎంపికైనట్టు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.

భట్టు సాయిశ్రీజ, గాయత్రి రచన త్రిపురాణ, కక్కిరేణి మణికంఠ - ఐదు సంవత్సరాల పదవీ కాలానికి ఫిక్స్ డ్ టర్మ్ ఇంజనీర్స్ (ఉ-ఐఐ గ్రేడ్)గా ఎంపికైనట్టు తెలియజేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బీఈఎల్ నిర్వహించిన రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూల వంటి కఠినమైన ప్రాంగణ నియామక ప్రక్రియ ద్వారా ఆ ముగ్గురిని ఎంపిక చేశారన్నారు.

ఈ సమాచారాన్ని అధికారికంగా బీఈఎల్ మేనేజర్ (హెచ్ఆర్) సభ్య కార్యదర్శి ఏప్రిల్ 23న అధికారిక లేఖ ద్వారా గీతం హైదరాబాదులోని కెరీర్ గైడెన్స్ సెంటర్ (సీజీసీ)కి తెలియజేశారన్నారు.

ఈ అద్భుతమైన విజయాన్ని సాధించిన విద్యార్థులను గీతం నాయకత్వం హృదయపూర్వకంగా అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, సీజీసీ డైరెక్టర్ డాక్టర్ కె.మమతా రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ టి.లోకేష్, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి తదితరులు వారిని అభినందించినట్టు తెలిపారు.

ఈ మైలురాయి గీతం విద్యా నైపుణ్యం పట్ల నిబద్ధతను, అసాధారణమైన కెరీర్ అవకాశాలతో విద్యార్థులను శక్తివంతం చేయడమే గాక, పరిశ్రమతో ఉన్న దాని బలమైన అనుబంధాన్ని కూడా వెల్లడిస్తోందన్నారు



## ఉగ్రమూకల దాడి అమానుషం

– హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

మీరుదొడ్డి, ఏప్రిల్ 24, మనం న్యూస్: జమ్మూలోని ఫహల్ గాన్ లో మంగళవారం జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మ శాంతి కలగాలని మిడిదొడ్డి మండల కేంద్రంలో హిందూ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్రవాదులు దొంగ చాటున వచ్చి పిరికిపంద చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. టెర్రరిస్టులకు వ్యతిరేకంగా దేశం మొత్తం ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఉగ్రవాదులు దొంగ దెబ్బతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేరన్నారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి గ్రామ హిందూ సేవా సమితి సభ్యులు ఐలయ్య, దేవరాజు, లింగాల సదానంద రెడ్డి, పూస రాజు, పరశురాములు, రాజు, కరుణాకర్, రమేష్, శివ,నవీన్, యాదగిరి తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## P.O ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

టేక్మాల్: ఏప్రిల్ 24 (మనం న్యూస్) టేక్మాల్ గురువారం, జిల్లాలోని టేక్మాల్ మండలం ఎల కుర్తి, చల్లపల్లి గ్రామాలలో P.O ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ౯జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సందర్శించి, కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పర్యవేక్షించి, కొనుగోళ్ల రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించాలని, రైతుల పూర్తి వివరాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లు పూర్తైన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ లో కొనుగోళ్ల వివరాలను నమోదు చేయాలని, తద్వారా సకాలంలో రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని సూచించారు.

ఈ పరిశీలనలో టేక్మాల్ తాసిల్దార్ తులసీరామ్, ఆర్ఐ సాయి శ్రీకాంత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## బస్సులో పోగొట్టుకున్న పర్సను ప్యాసింజర్‌కు అందజేసిన ఆర్టీసీ అధికారులు

**ఆర్టీసీ అధికారులు ప్రకాష్**

సదాశివపేట ఏప్రిల్ 24.(మనం న్యూస్): బస్సులో పోగొట్టుకున్న పర్సును దొరకవతి ప్యాసింజర్ కు అందజేసినట్టు ఆర్టీసీ అధికారులు ప్రకాష్ అన్నారు. వివరాల ప్రకారం సిద్దిపేట నుండి సోలాపూర్ వెళుతున్న ఆర్టీసీ బస్సులో సికింద్రాబాద్ నుండి ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికుడి పర్సు సదాశివపేట బస్టాండ్ లో పోయింది వెంటనే అక్కడ ఉన్న కంట్రోలర్ కు సమాచారం ఇవ్వడంతో అతడు జయరాబాద్ బస్టాండ్ కంట్రోలర్ సంఘున్నకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఆ బస్సును వెతకగా పర్సు దొరికింది. దానిని సదాశివపేట బస్టాండ్ ప్రకాష్ కి పంపించడంతో ఆ ప్రయాణికుడికి రాజు, శ్రీనివాస్ సమక్షంలోఆ పర్సును అప్పగించారు. అందులో ఉన్న 1514 రూపాయలు పేటీఎం కార్డు అన్ని ఉన్నాయని అధికారులు చొరవ చూపి నా పర్సు ఇప్పించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## పహల్గాం నిందితులను వెంటనే ఉరి తీయాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24, మనం న్యూస్: పహల్గాం నిందితులను వెంటనే గుర్తించి బహిరంగంగా నిందితులను వెంటనే ఉరి తీయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తాలో జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండించారు. మృతి చెందిన కుటుంబాల సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఉగ్రవాద సంస్థకు వత్తాసు పలుకుతున్న పాకిస్తాన్ కు ప్రపంచ దేశాలు సహాయ నిరాకరణ చేయాలన్నారు. పహల్గాం సంఘటనకు బాధ్యత వహించి ప్రధాన మంత్రి మోడీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



## శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా విజయవంతం

**కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు**

సదాశివపేట మనం న్యూస్ ఏప్రిల్ 24: పట్టణంలోని శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ డిగ్రీ పిజి ఇలా పై చదువులు పూర్తి చేసుకున్నటువంటి విద్యార్థులు ఎందరో నిరుద్యోగంతో బాధపడుతున్న తరుణంలో.... కంపెనీ వారిని సంప్రదించి కళాశాల ప్రాంగణంలో గురువారం నాడు జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. వారి చదువుకు తగినటువంటి ఉద్యోగంలో పదుల సంఖ్యలో సెలెక్ట్ అయ్యారు.

ఈ ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగం సాధించినటువంటి నిరుద్యోగ విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. తదుపరి జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్నటువంటి కంపెనీ వారికి కళాశాల యాజమాన్యం తరపున శాలువాతో సన్మానం చేసి మేమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అరవిందరావు , నర్సింలు, ప్రవీణ్ కుమార్, సతీశ్ కుమార్, రవీందర్, మహేష్ సౌజన్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన నాగిరెడ్డి

**- మాజీ టీచర్ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి**
**- ఘనంగా నాగిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం**
**- హాజరైన ఎస్సీ, ఎస్టి కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్**



తొగుట, ఏప్రిల్ 24, మనం న్యూస్: అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయ వృత్తి మహా పవిత్రమైనదని దానిని పూర్తిగా సద్వినియోగపరచి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఘనత సోమాగారి నాగిరెడ్డికే దక్కిందని మాజీ టీచర్ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి కొనియాడారు. తొగుట మండలం గుడికందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సోమగారీ నాగిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కీ వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి లు పాల్గోన్న కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నాగిరెడ్డి ఉన్నత ఆశయంతో ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దారని, అత్యుత్తమ బోధనతోపాటు సమయపాలన పాటిస్తూ, విలువలతో కూడిన విద్యను బోదిస్తూ, విద్యార్థులకు నైతిక విలువలను నేర్పి సమాజంలో క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఉండాలన్న తాపత్రయంతో పనిచేసేవారన్నారు. ఆయన ఏ పాఠశాలలో పనిచేసినా ఆ పాఠశాలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో ఎంతో చొరవ తీసుకొని దాతల సహారంతో పాఠశాల అభివృద్ధికి పాటుపడడంలో అందె వేసిన చేయిగా పేర్కొన్నారు. మధ్యలో బడి మానివేసిన విద్యార్థుల ను ఓపెన్ స్కూల్ విద్య ద్వారా ఉత్తీర్ణులు గావించి వివిధ రంగాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగాను, ఆశా వర్కర్లు గాను అంగన్వాడీ టీచర్లు గాను కాంట్రాక్టు ఉద్యోగులుగాను ఎన్నో సంస్థల్లో నియామకం చేయించి వారి భవిష్యత్తుకు బాటలు వేసిన గొప్ప సేవా తత్పరుడు అని కొనియాడారు. 30 సంవత్సరాల ఆయన పదవీ కాలంలో నిరంత



రం పాఠశాల అభివృద్ధికి పాటు పడి, విద్యార్థుల భవిష్యత్ కోసం పాటు పడే వారన్నారు. ఈ కార్యక్రమంలో తొగుట మండల ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, విఎంఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వంగ మహేంద ర్ రెడ్డి, తెలంగాణ సచివాలయం అధ్యక్షులు గిరి శ్రీనివాసరెడ్డి, పిఆర్టియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదరాశిపల్లి శశిధర శర్మ, సచివాలయ మాజీ ఉపాధ్య క్షులు సోమగారి మల్లారెడ్డి, మండల విద్యాధికారులు నరసయ్య, ప్రభుదాస్, అంజాగౌడ్, ప్రవీణ్ బాబు, తొగుట అక్బర్పేట్ భూంపల్లి, మీరుదొడ్డి మండలాల అధ్యక్ష కార్యదర్శులు పుల్లగూర రామచంద్రారెడ్డి, సురేందర్ రెడ్డి, సిద్ధి వెంకటేష్ చంద్రారెడ్డి పులి మహేందర్ బాలకిషన్,టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు గాడిపల్లి తిరుపతిరెడ్డి, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ ప్రొఫెసర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త రాంభూపాల్ రెడ్డి, అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు పిఏసిఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి, విభీషణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కిష్టాగౌడ్, బైర గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




## ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించిన హిందు సంఘాలు

దౌల్తాబాద్, ఏప్రిల్ 24, మనం న్యూస్: పహల్గాం దాడికి నిరసనగా శ్రీ హనుమాన్ దేవాలయం ఆవరణలో కొవ్వొత్తుల ప్రదర్శనను ప్రధాన వీధులలో నిర్వహించారు. అనంతరం శివాజీ చౌరస్తాలో విలేకరుల సమావేశంలో హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇటీవల జమ్మూ కాశ్మీర్లో విహారయాత్రలో ప్రయాణిస్తున్న యాతకులపై కాల్పులు జరిపి హత్య చేయడం బాధాకరమన్నారు. చంపే ముందు విహారయాత్రలను ఒక్కొక్కరిని పిలుచుకుంటూ వారు వేసుకున్న వస్త్రాలను విడిపించి కాల్చి చంపడం మానవజాతి సిగ్గుపడే చర్య అని మండిపడ్డారు. మనమంతా భారతీయులం అంటూ ఎన్నికలలో ప్రచారం చేస్తూ అధికారాన్ని పొందిన నాయకులు ఈ సంఘటనపై నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. హిందువులంతా నాకేమీ సంబంధం నేను నా కుటుంబం సంతోషంగా ఉన్నామనుకునే హిందువులు ఇకనైనా చైతన్యం కాకపోతే జమ్మూ కాశ్మీర్ లో జరిగిన సంఘటన మాదిరిగానే మన గ్రామాలను కూడా జరిగే ప్రమాదం ఉందని వారు మండిపడ్డారు. మరణించిన వారి ఆత్మ శాంతించాలని మౌనం పాటించారు. భారతదేశంలో జీవిస్తున్న వారు ప్రతి ఒక్కరూ మేము భారతీయులం అన్న విషయాన్ని మర్చిపోయి మనందరం జీవిస్తున్న అన్నారు. ఇకనైనా ఇలాంటి చర్యలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సమ్మె సభ్యులు పాల్గొన్నారు.

## వరంగల్ సభను విజయవంతం చేయాలి

**- వాల్ పోస్టర్ ఆవిష్కరణ**
**- బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ రహీముద్దీన్**

దౌల్తాబాద్, ఏప్రిల్ 24, మనం.న్యూస్: చలో వరంగల్ సభను విజయవంతం చేయాలని వాల్పోస్టర్ ఆవిష్కరించిన బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ రహీముద్దీన్ గురువారం మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో ఈనెల 26న వరంగల్లో జరిగే మాజీ కెసిఆర్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున రావాలని ప్రజలకు పిలుపునిచ్చి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలం నుండి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి 26న జరిగే బహిరంగ సభకు మండల ప్రజలను 20 వేల నుండి 25 వేల వరకు తరలించే విధంగా చూస్తున్నామని తెలియజేశారు. గ్రామాలలో తాజా మాజీ జెడ్పిటిసిలు ఎంపీటీసీలు తాజా మాజీ సర్పంచులు గ్రామాల అధ్యక్షులు అందరూ మమేకమై తమ తమ గ్రామాలలకు వచ్చే బస్సులు కానీ డీసీఎంలలో కానీ పెద్ద ఎత్తున కార్యకర్తలు కదలి రావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోహన్ రావు యూత్ అధ్యక్షులు నర్ర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# రజతోత్సవాలకు రెడీ

**- మరోమారు ఉద్యమ స్ఫూర్తితో**
**-నేటి నుంచి పాదయాత్ర ప్రారంభం**
**-మూడు రోజుల్లో సభా స్థలికి**

సిద్దిపేట, ఏప్రిల్ 24, మనం న్యూస్ ప్రతినిధి: సిద్దిపేట రజతోత్సవ పండుగకు సంబురంగా రెడీ అవుతోంది. ఉద్యమ ఖిల్లాగా పేరున్న సిద్దిపేట మరోసారి ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించనుంది. బి.ఆర్.ఎస్. పార్టీ ఈ నెల 27వ తేదీన రజతోత్సవ సంబరాలను అత్యంత వైభవంగా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న సభ కోసం అన్ని విధాలా సన్నద్ధమైంది. సిద్దిపేట అంటేనే ప్రత్యేకత కలిగిన ప్రాంతం కావున 64 కి.మీ.ల దూరమున్న సభా స్థలికి పాదయాత్ర ద్వారా చేరుకునేందుకు సిద్ధమైంది సిద్దిపేట యువత. వార్డుకు, గ్రామానికి 20 నుండి 30 మంది చొప్పున రంగధాంపల్లి అమరవీరుల స్థూపం నుండి 25వ తేదీన ఉదయం పాదయాత్ర ప్రారంభం కానుంది. ఇప్పటికే పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి కాగా 25వ తేదీన ఉదయం 6 గంటలకు మాజీమంత్రి హరీష్ రావు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించనున్నారు.

**-ఏర్పాట్లు పూర్తి**

పాదయాత్ర ద్వారా సభాస్థలికి చేరుకోనున్న యువత, విద్యార్థి నాయకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడు రోజుల పాటు ఎక్కడికక్కడ పకడ్బందీ ఏర్పాట్లను ఇప్పటికే పాదయాత్రను చూస్తున్న నిర్వాహకులు పూర్తి చేశారు. రంగధాంపల్లి అమరవీరుల స్థూపం నుండి ప్రారంభమయ్యే పాదయాత్ర సిద్దిపేట హన్మకొండ రహదారి మీదుగా సభకు చేరుకోనుంది. మూడు రోజుల పాటు పాదయాత్రకు అవసరమైన వసతులు, భోజన సౌకర్యం వంటి వాటిల్లో ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్తగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. పాదయాత్రలో పాల్గొనే వారందరికీ ప్రత్యేకమైన బ్యాగును ఇవ్వడమే కాకుండా గులాబీ రంగు టీ షర్టులు, తలపై టోపీ, చేతిలో జెండా కర్రతో యాత్ర సాగించనున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న పాదయాత్రకు అవసరమైన భోజన సదుపాయాలు, బస వంటి ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఏది ఏమైనా సిద్దిపేట అంటేనే ఉద్యమ స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం కాగా కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం బి.ఆర్.ఎస్. పార్టీ సత్తాను చాటేందుకు ఘనంగా నిర్వహిస్తున్న ఎల్కతుర్తి సభలో సిద్దిపేటనే ప్రత్యేకంగా నిలవనుంది.



## బాధితునికి సీఎంఆర్ చెక్కు అందజేత

**గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి**

జగదేవపూర్, ఏప్రిల్ 24, మనం న్యూస్: సీఎంఆర్ఎఫ్ చెక్ పేద ప్రజలకు వరమని గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, జిల్లా యువ నాయకులు చిలుకూరి మహేందర్ రెడ్డి అన్నారు.

జగదేవపూర్ మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన ఇప్పల గూడెం నరేందర్ రెడ్డి చేతి విరిగినవిషయం విదితమే. ప్రైవేట్ హాస్పిటల్ లో అధిక ఖర్చులు కాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకులు చిలుకూరు మహేందర్ రెడ్డి గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా సీఎం ఆర్ ఎఫ్ కు దరఖాస్తూ చేసుకోగా, మాజీ ఎమ్మెల్యే తూాకుంట నర్సారెడ్డి సహకారంతో సీఎం ఆర్ యఫ్ చెక్కు రూ.60,000/- రూపాయలు మంజూరు చేయడం జరిగింది. గురువారం నాడు కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకులు చిలుకూరు మహేందర్ రెడ్డి,వంటేరు భాగ్యరెడ్డి, కుకునూరి కృష్ణ చేతుల మీదుగా చెక్కును బాధితునికి అందజేశారు. బాధితుడు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వీరితో పాటుగా జూపల్లి మహేందర్, బయ్యారం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## ఎంపీ సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

దుబ్బాక, ఏప్రిల్ 24, మనం న్యూస్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు కృషి చేస్తున్నారని తాజా మాజీ కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి అన్నారు. దుబ్బాక మున్సిపాలిటీ మూడో వార్డులో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సహకారంతో వార్డు తాజా మాజీ కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాపుర బోయిన అభిలాష్ అనారోగ్య రీత్యా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 60000 రూపాయలు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం నిలిచే వ్యక్తి ఎంపీ రఘునందన్ రావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 44, 45 బూత్ అధ్యక్షులు కంకణాల బాబు, సత్తు మహేందర్ రెడ్డి, బిజెపి నాయకులు ఒగ్గు తిరుపతి, ఆకుల నరేష్, కంకణాలు నవీన్, కంకణాల రాజు, కోడూరి శివ తదితరులు పాల్గొన్నారు.




## గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూమి కంచ వేసినట్టు కనబడుతుంది

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పడాల రాములు**

దౌల్తాబాద్, ఏప్రిల్ 24, మనం న్యూస్: గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన భూమి కంచ వేసినట్టు కనబడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో ఇందిరాగాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం కానీ నిరుపేదలకు సీలింగ్ భూములు అసైన్మెంట్ భూములు పంపిణీ చేయగా వాటిని దారదత్వం చేసుకున్న పార్లమెంట్ సభ్యులు దారా దత్తం చేసుకొని అనుభవిస్తున్న భూములను తిరిగి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నిరుపేద రైతులకు తిరిగి ఇయ్యాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి అట్టి భూమిని నిరుపేదలకు అందే వరకు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని రెవిన్యూ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధం శశికాంత్ బాల శేఖర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంపల్లి వినోద్ రాయపోల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్ అనిల్ గౌడ్ ఎర్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల వేసవి సెలవులపై

# వెంటనే నిర్ణయం తీసుకోవాలి

**అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ.**

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24, మనం న్యూస్: అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ మినీ అంగన్వాడీ టీచర్లకు అందరికీ మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. పద్మ డిమాండ్ చేశారు. గురువారం రోజున కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఎండాకాలం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా ఒకపూట బడిని నిర్ణయిస్తూ సర్క్యులర్ను జారీ చేసినందుకు తమరికి మా యూనియన్ రాష్ట్ర కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ మధ్య ములుగు జిల్లాలో జరిగిన పోషణ్ పక్వాడ కార్యక్రమం సందర్భంగా ఐసిడిఎస్ మంత్రి సీతక్క సమక్షంలో మే నెలంతా సెలవులివ్వడం కోసం పరిశీలిస్తున్నామని, తప్పకుండా మే నెలంతా సెలవులు ఇస్తామని హామీనిచ్చారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కానీ మే నెల సమయం దగ్గర పడుతుండటంతో ఇంకా ప్రభుత్వం మే నెలంతా సెలవుల పైన నిర్ణయం చేయనందున అంగన్వాడీ ఉద్యోగులు తీవ్రమైన ఆందోళనకు గురౌతున్నారనీ, 40 డిగ్రీలకు పైగా ఎండల తీవ్రత, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల్లేకపోవడం, పెద్ద పిల్లలు సెలవులతో ఇంట్లో ఉన్నప్పుడు, చిన్న పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు ఎంత బలవంతం చేసినా రాని భౌతిక పరిస్థితులు వివరంగా గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు తెలియజేయడం జరిగిందన్నారు. 24 రోజుల సమ్మె సందర్భంగా మే నెలంతా సెలవుల పైన గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశాము. అయినా నేటికీ ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయలేదు. వెంటనే సమస్యలు పరిశీలించి పరిష్కారం చేయాలని, మే నెలంతా ఒకేసారి అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్లకు సెలవులు వెంటనే నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, జిల్లా సహాయ కార్యదర్శి సింగిరెడ్డి చంద్రారెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, వీరమని,శారద, కళావతి, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి స్నానంతో చర్మ రోగాలు మాయం

**– యోగ ఆచార్యులు సిద్దిరాములు**

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24, మనం న్యూస్: మట్టి స్నానంతో చర్మ రోగాలు మాయం అవుతాయని యోగా ఆచార్యులు సిద్ది రాములు అన్నారు. శబరి గిరీషా సేవా సమితి, సంక్షేమ సిద్ది యోగా సంయుక్త



ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అయప్ప దేవాలయం సమీపంలో యోగా గురువులు పెద్ది మనోహర్, శివ శ్రీనివాస్, ఎలిగేటి కృష్ణమూర్తి నేతృత్వంలో మట్టి స్ధానం కార్యక్రమం నిర్వహించారు. మొదట కార్యక్రమానికి హాజరైన వారితో సూక్ష్మ యోగా ఆసనాల సాధన చేయిస్తూ ఉపయోగాలను వివరించారు. మట్టి స్నానం వలన కలిగే ఉపయోగాలను బోధించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో మట్టి స్నానం చేయించారు. ఈ సందర్భంగా సంక్షేమ సిద్ది యోగా వ్యవస్థాపకుడు ఆచార్యులు సిద్ది రాములు మాట్లాడుతూ పురాతన కాలంలో నుంచి మట్టి స్నానం ఆచరించే వారు అన్నారు. ఆధునిక కాలంలో అనేక చర్మ సమస్యలతో ఇబ్బందులకు గురవుచున్న వారు మట్టి స్నానం ఆచరించడంతో ఉపశమనం లభిస్తుందన్నారు. మట్టి స్నానంతో శరీర ఉష్ణోగ్రత తగ్గించ బడడంతో పాటుగా, మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ యోగ సభ్యులు దండే ప్రభుదాస్, శివ శ్రీనివాస్, రంగాచారి, అంబటి పల్లి భాస్కర్, జూలురి రవి, మురళి కృష్ణ, రవీందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశభద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండించిన**
**సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్**



సదాశివపేట ఏప్రిల్ 24.(మనం న్యూస్):చేపట్టాలని సదాశివపేట సిపిఎంఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం నాడు ఒక ప్రకటన ద్వారా తెలియజేస్తూ కాశ్మీర్ లోని పహాల్గం ప్రాంతంలో పర్యాటకులపై దాడి చేసి 27 మందిని చంపిన ఉగ్రవాదుల చర్యలను సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని దేశ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్ అన్నారు.

ఆయన మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ లోని పహాల్గాం పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి వెళ్లిన 27 మంది పర్యాటకులను విచక్షణరహితంగా దాడి చేసి తుపాకులతో కాల్చి చంపిన ఉగ్రవాదుల చర్యలను దేశ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఇది పిరికిపందల చర్యగా అభివర్ణించారు.ఈ దాడిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉందని మరి కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు భిన్నత్వంలో ఏకత్వం కలిగి వసుదైక కుటుంబ భావన కలిగిన భారత దేశంలో ఇటువంటి విద్వేష విభజన రాజకీయాలను దేశం ఏనాటికి అంగీకరించదని అన్నారు పరస్పర సహకారం సహనం తో ప్రపంచ అభివృద్ధి జరుగుతుందే తప్ప ప్రజల ఆచారాలు సాంప్రదాయాలు ఆహార అలవాట్లపై ద్వేషం పెంచుకోవడం వల్ల ఒనగూరేది ఏమీ లేదని అన్నారు పర్యాటకులపై జరిగిన ఉన్మాద చర్యలకు వ్యతిరేకంగా బాధిత కుటుంబాలకు అండగా దేశ ప్రజానీకం నిలబడాలని కోరారు కేంద్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా సహాయం అందించాలని డిమాండ్ చేశారు దేశంలో ఆర్మీలో రెండు లక్షల పైగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి దేశ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు దేశ ప్రజలు ఐక్యతతో దుశ్చర్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

# బిఆర్ఎస్ సభను విజయవంతం చేయండి

## బి ఆర్ ఎస్ నాయకులు రాచమల్ల ఎల్లేష్



జగదేవ్ పూర్, ఏప్రిల్ 24, మనం న్యూస్: ఈనెల 27వ తేదీన వరంగల్ లో జరగనున్న భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని జగదేవ్ పూర్ మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాచమల్ల ఎల్లేష్ కోరారు. గురువారం మండల కేంద్రమైన జగదేవ్ పూర్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం టిఆర్ఎస్ ను స్థాపించిన మాజీ ముఖ్యమంత్రి, బి ఆర్ ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు అనేక ఉద్యమాలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ ప్రజల కల సాకారం చేయడం చారిత్రాత్మక విషయమన్నారు. బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ప్రగతి పథంలో పయనించి ప్రజలు సుఖసంతోషాలతో జీవనం సాగించారన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి సంక్షేమ పథకాల్లో అన్ని రంగాలు కుదేలైపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా కారు చీకట్లు అలుముకున్నాయని ప్రజలు తిరిగి బీఆర్ఎస్ పరిపాలన కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో వరంగల్ లో జరుగుతున్న బీఆర్ఎస్ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పాలని ఆయన కోరారు.



# ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్చెరుఏప్రిల్ 24మనం న్యూస్ : తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఘనపూర్ గ్రామంలో గల శ్రీ సాయిబాబా దేవాలయం వార్షికోత్సవంలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆలయ ధర్మకర్త బాసిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి నీనా చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు గరుడ ప్రసాదం అందజేత







## - వెంకటేశ్వర ఆలయంలో కల్యాణం

నంగునూరు, ఏప్రిల్ 24, మనం న్యూస్: పాలమాకులలోని వెంకటేశ్వర ఆలయ 13వ వార్షికోత్సవం పురస్కరించుకొని శుక్రవారం సంతానం లేని వారు, పెళ్లి కాని వారికి గరుడ ప్రసాదం అందజేస్తామని పూజారి రణధీరా చార్యులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు నవ కలశ స్థాపన, ధ్వజారోహణం, పల్లకి సేవ పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు పద్మావతి, గోదా సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం కన్నుల పండువగా జరిపిస్తామన్నారు. సాయంత్రం పుష్పయాగం ఉంజాల్ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా పేరు నమోదు చేసుకోవాలని, ఈ సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

జగదేవ్ పూర్, ఏప్రిల్ 24, మనం న్యూస్: ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన జగదేవ్పూర్ మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన ఎడపల్లి బాల్ నర్సయ్య (58) కుటుంబ సభ్యులకు గురువారం జగదేవపూర్ మండల రజక సంఘం సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ ఆధ్వర్యంలో రజక సంఘం నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రాచకొండ సీతారాములు ఎడపల్లి వెంకటయ్య అక్కారం నరసింహులు రాచకొండ బాల్ నరసయ్య రాసం కరుణాకర్ రాచకొండ ఆంజనేయులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





# ఛలో వరంగల్ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

## బి.ఆర్.ఎస్. మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ రహీముద్దీన్

దౌల్తాబాద్, ఏప్రిల్ 24, మనం న్యూస్: ఛలో వరంగల్ సభను విజయవంతం చేయాలని వాల్ పోస్టర్ ను బీ.ఆర్.ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ రహీముద్దీన్ ఆవిష్కరించారు. గురువారం మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో ఈనెల 26న వరంగల్ లో జరిగే మాజీ సీ.ఎం. కెసిఆర్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున రావాలని ప్రజలకు పిలుపునిచ్చి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలం నుండి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి 26న జరిగే బహిరంగ సభకు మండల ప్రజలను 20 వేల నుండి 25 వేల వరకు తరలించే విధంగా చూస్తున్నామని తెలియజేశారు. గ్రామాలలో తాజా మాజీ జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు గ్రామాల అధ్యక్షులు అందరూ మమేకమై తమ తమ గ్రామాలకు వచ్చే బస్సులు కానీ డీసీఎంలలో కానీ పెద్ద ఎత్తున కార్యకర్తలు కదలి రావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోహన్ రావు, యూత్ అధ్యక్షులు, నర్ర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దారెడ్డిపేటలో ఘనంగా తుల్జా భవాని మాత కళ్యాణ మహోత్సవం

జోగిపేట :ఏప్రిల్ 24 :(మనం న్యూస్ ):సంగారెడ్డి జిల్లా ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పుల్కల్ మండల పరిధిలో పెద్ద రెడ్డిపేట గ్రామంలోని తుల్జా భవాని మాత జాతర మహోత్సవ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు గురువారం తుల్జా భవాని మాత కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభోగంగా నిర్వహించారు. గత 32 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న తుల్జా భవాని మాత జాతర కార్యక్రమంలో భాగంగా నాలుగు రోజుల నిర్వహించే వివిధ జాతర ఉత్సవ కార్యక్రమంలో చివరి రోజు అయిన నేడు తుల్జా భవాని



మాత కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొన్ని వేల సంఖ్యలో హాజరైన భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.